క్లుప్తంగా

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ

గంట్యాడ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు కిట్లు అందజేశారు. ఒక్కొక్కరికీ గుడ్లు, పాలు, రాగి పిండి, కర్జూరం, వేరుశనగ చెక్కీలతో కూడిన కిట్లను అందజేశారు.

కుకింగ్ యంత్రాల వితరణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు శ్రీరాంనగర్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు కుకింగ్ సామగ్రి వితరణ చేశారు. పుల్కా తయారీ యంత్రంతో పాటు హాట్ డిస్‌లను ఫేకర్ సీఈఓ ఎంఎస్ఎస్ శర్మ చేతులమీదుగా శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ప్రతినిధులు కమలాకర్, రామారావు, మధు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వేపాడలో పి.వి.రావు వర్ధంతి



పి.వి.రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నేతలు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో పి.వి.రావు వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పి.వి.రావు చిత్రపటానికి మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్, ఆనంద్, నారాయణరావు, బంగారయ్య, ఉల్లి దేముడు, మరడాన కృష్ణ, ఎం.దేవరాజ్, సోమునాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. దళితుల సమస్యల పరిష్కారానికి పీవీ రావు చేసిన పోరాటాలు, సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

వేపాడ: మండలంలో శింగరాయి గ్రామానికి చెందిన చప్ప అవతారం ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయాన్ని ప్రభుత్వం అందించింది. సర్పంచ్ వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి కన్నం నాయుడు రూ.10 వేలును మృతుని భార్య లక్ష్మికి శుక్రవారం అందజేవారు. మిగిలిన బీమా మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం సేకరణ

గంట్యాడ: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరించాలని, ఎక్కువగా ధాన్యం తీసుకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.నీలకంటేశ్వరరెడ్డి మిల్లు యాజమానులను హెచ్చరించారు. మండలంలోని పలు రైస్ మిల్లులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మిల్లుల వద్దకు వచ్చిన రైతులతో మాట్లాడారు. మిల్లు యాజమానులు ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే ట్రాక్కుల నుంచి అన్‌లోడ్ చేయాలని మిల్లు సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గజపతినగరం: స్థానిక లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ నరేంద్ర జ్ఞాపకార్థం శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక శిబిరాన్ని ప్రారంభించారు. గజపతినగరం ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 18 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి స్థానిక శ్రీనివాస నర్సింగ్ హోమ్‌కు రిఫర్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.ఆదినారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు పి.టి.కుమార్, బెల్లాన లక్ష్మీనరేన్, డాక్టర్ రెడ్డి పావని, బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో కలిశెట్టి ఆదినారాయణకు చెందిన పూరిల్లు దగ్ధమైనట్టు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. నిరుపేద అయిన ఆదినారాయణకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషిచేస్తామన్నారు.

అవంతి కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. విశాఖపట్టణానికి చెందిన బ్రదర్ పి.ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని బైబిల్ విశిష్టతను, క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసు క్రీస్తు బోధనలు యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జాషువాజయప్రసాద్ మాట్లాడుతూ క్రీస్తు జననం భూమి మీద మనుషులను దేవునితో సమానపరచటానికి జరిగినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన క్రిస్మట్ ట్రీ, క్రీస్తు జననాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన పశువుల పాక ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ విద్యకు పెద్దపీట

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ



గుర్ల: కెల్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కెల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఇంగ్లిష్‌లో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష. పిల్లల చదువు తల్లిదండ్రులకు భార కాకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తే.. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల పిల్లలు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు వినియోగిస్తూ.. ఇంగ్లిష్ మీడియంలో పెద్ద చదువులు చదువుకోవాలి, కానీ పేదల పిల్లలు చదువుకోకూడదా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రతీ విద్యార్థి ఇంగ్లిష్‌లో మాట్లాడటంతో పాటు విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించే పరిస్థితిని ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ పాల్గొన్నారు. అదేవిధంగా చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధులు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు.



చీపురుపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష, తదితరులు



చీపురుపల్లిరూరల్: గరివిడి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



మెరకముడిదాం: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శృంగవరపుకోట: సంతగవిరమ్మపేట యూపీ స్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సర్పంచ్ కళావతి, తదితరులు



వేపాడ: నీలకంఠరాజపురంలో ట్యాబ్‌లను అందిస్తున్న సర్పంచ్ గొటివాడ దేవీ, తదితరులు



జామి: లొట్లపల్లి హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సరయు



గంట్యాడ: రామవరం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పీరుబండి హైమావతి



బొండపల్లి: గొట్లాం ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ



గజపతినగరం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు



దత్తిరాజేరు: పెదమానాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి



మెంటాడ(గజపతినగరం రూరల్): మరుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, తదితరులు



శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్న చైర్మన్ రమణ, హెచ్ఎం ఉమామహేశ్వరరావు, తదితరులు



వేపాడ: సోంపురంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సర్పంచ్ మురిపిండి గంగరాజు, తదితరులు

మట్టిలో మాణిక్యం

- ఎస్ఐ పోస్టు సాధించిన పేదింటి అమ్మాయి
- రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు



లోగిశ కృష్ణవేణి

మెంటాడ(గజపతినగరం రూరల్): రైతు కుటుంబానికి చెందిన అమ్మాయి ఎస్ఐ పరీక్షల్లో ప్రతిభ చూపింది. పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయిలో మహిళా విభాగంలో ఫస్ట్ ర్యాంకు, ఓవరాల్‌గా 7వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రుల కష్టానికి ఫలితం దక్కించి, యువతీయువకులకు ఆదర్శంగా నిలిచింది. గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన లోగిశ సత్యం, తల్లి లోగిశ అచ్చియమ్మలది సన్నకారు రైతు కుటుంబం. ఎకరా భూమిలో సాగుచేసిన పంటే జీవనాధారం. కుమార్తె కృష్ణవేణిని కష్టపడి చదించారు. పదోతరగతి వరకూ ఊరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన అమ్మాయి, ఇంటర్మీడియట్ గజపతినగరంలోని సాయిసిద్ధార్థ కళాశాల లోను, డిగ్రీ విద్యను విజయనగరంలోని ఎంఆర్ కళాశాలలో పూర్తిచేసింది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూనే మరోవైపు ఎస్ఐ పరీక్షకు సిద్ధమైంది. ఎస్సై ఫలితాల్లో రాష్ట్రంలోనే మహిళా విభాగంలో 273 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచి సివిల్ ఎస్సైగా ఎంపికైంది. కుమార్తె ఎస్ఐ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. భవిష్యత్తులో జిల్లాస్థాయి అధికారి కావాలన్నదే తన ఆకాంక్షఅని, ప్రజలకు ఉత్తమ సేవలందిస్తానని కృష్ణవేణి 'సాక్షి'కి తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

వేపాడ: స్థానిక శ్రీదేవీ భూదేవీ సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం ఉత్తర ద్వారా దర్శనం, స్నపన తిరుమంజనంలో క్షీరాభిషేకం, సుగంధద్రవ్య అభిషేకం, హరిద్రోకాభిషేకం, నక్షత్ర హారతి, పట్టువస్త్రాలంకరణతో స్వామికి అష్టోత్తరశతనామ పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి స్వామివారికి నవనీతసేవ (వెన్నతో) నిర్వహించారు.

రామలింగాపురంలో..

చీపురుపల్లి రూరల్: మండలంలోని రామలింగాపురంలో ఉన్న రామాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఉత్తరద్వార దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



చీపురుపల్లి రూరల్: రామలింగాపురంలో వైకుంఠ ఏకాదశి పూజలకు ముస్తాబైన రామాలయం

ఈ ప్రాంతంలో ఉత్తర ద్వార దర్శనం ఉండే ఆలయం ఇదొక్కటే కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ మెంబర్లు, గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే శ్రీమహావిష్ణువును ప్రత్యక్షంగా దర్శనం చేసుకున్న భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

కెల్ల సొసైటీలో లాకర్ సేవలు ప్రారంభం

గుర్ల: గ్రామీణ ప్రాంత ప్రజలు సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కెల్ల పీఏసీఎస్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన లాకర్ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజలు రూ.100లకే లాకర్ సదుపాయం పొందవచ్చన్నారు. 30 ఏళ్ల క్రితం రూ.2 లక్షలతో ప్రారంభమైన ఈ సొసైటీ నేడు రూ.20 కోట్లుకు చేరిందన్నారు. అనంతరం సొసైటీ పరిధిలోని 2,098 మంది రైతులకు రూ.7.96 లక్షలను డివిడెంట్ రూపంలో అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె.వి.సూర్యనారాయణరాజు, డీసీసీబీ సీఈఓ జనార్దన్, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు, అంబల్ల చిన్నారావు పాల్గొన్నారు.

బాలికను కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

శృంగవరపుకోట: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని శృతిని టీచర్ జి.నాగమణి కొట్టారని, బాధ్యులైన పాఠశాల యాజమాన్యంపై, స్కూల్ టీచర్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసి ఎస్సై లోవరాజును వివరణ కోరగా.. ఇరు వర్గాలకు నోటీసు చేశామని, వారి స్పందనను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సంబంధించి ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి కొఠారుబిల్లి జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈనెల 26న అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారంతా పోటీల్లో పాల్గొనేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ వై.భవాని, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

దత్తిరాజేరు: మండలంలో టిమిటేరు గ్రామ సమీపంలోని మామిడి తోటలో జూదం ఆడుతున్న 11 మందిని పట్టుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష శుక్రవారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో కలిసి జూద శిబిరంపై దాడి చేసినట్లు చెప్పారు. పేకాడుతున్న 11 మందిని పట్టుకుని వారి వద్ద రూ.64,650 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 10 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాబ్‌మేళాలో 120 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ, వివిధ కంపెనీల ప్రతినిధులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన మెగాజాబ్ మేళాలో 120మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 320 మంది నిరుద్యోగ యువత హాజరైనట్లు చెప్పారు. తొమ్మిది కంపెనీలకు చెందిన ప్రతినిధులు మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారన్నారు. కంపెనీ అవసరాలకు తగిన నైపుణ్యాలు కలిగిన 120 మందిని వివిధ స్థాయిలలో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జాబ్ మేళాను ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక పరిశీలించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మాధవరావు, మోహనరావు, ఎన్ఎస్ఎస్ పీఓ చల్లా శ్రీనివాసరావు, విజయదుర్గ, షర్మిల, శ్రీనివాసరావు, బి.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

గణిత మేధావికి నివాళి

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని అన్ని పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామనుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితశాస్త్రంలో రామానుజన్ ప్రతిభా పాటవాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం గణిత పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



గంట్యాడ: గణిత ప్రాజెక్టుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 వెంకటరావు



గజపతినగరం: స్థానిక బాలుర హైస్కూల్లో గణిత పోటీ వేజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోట బాలికోన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): తాటిగూడ ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున ఉపాధ్యాయులు



కొత్తవలస: కంటకాపల్లి హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



లక్కవరపుకోట: జ్యోతీరావుపూలే పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థులు



వేపాడ: సోంపురంలో గణిత దినోత్సవం సందర్భంగా ప్రదర్శించిన గణిత నమూనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జ్యోతీరావుపూలేగురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ సీతారం



చీపురుపల్లి: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గణిత పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా సైన్స్ సమన్వయకర్త మిరియాల కృష్ణారావు



శృంగవరపుకోట: ఎస్‌జీ పేట యూపీ స్కూల్‌లో రామానుజన్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నిర్వాసితులకు సంతృప్తికరమైన పరిహారం

- ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ



కొతవలసలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస: జాతీయ రహదారి 516బి(పెందుర్తి–బౌడారా) రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన వారికి సంతృప్తికరమైన పరిహారం అందజేస్తామని, రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని రెవెన్యూ డివిజల్ అధికారి ఎం.వి.సూర్యకళ అన్నారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల పరిధిలో భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు ఈ ఏడాది జూన్ నెలలో సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సవరించిన మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందిస్తామన్నారు. అలాగే ఈ ఏడాది ఆగస్టు–24కు ముందు భూ మార్పిడి చెందిన భూములకు గజాల చొప్పున పరిహారం అందించనున్నట్లు చెప్పారు. అలాగే చెట్లు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యేక పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎల్.కోట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో రోడ్డు ఎలైన్‌మెంట్‌ను సవరించాలని, పరిహారం ఐదురెట్లు అందజేయాలని, నిపుణులచే రోడ్డు మార్కింగ్ చేయించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండల తహసీల్దార్లు శ్రీనివాసమిశ్ర, కళ్యాణచక్రవర్తి, కె.ప్రసన్నకుమార్, ఎస్‌హెచ్ ఏఈఈఏ ఎస్.సురేష్‌కుమార్, ఆర్డీఓ కార్యాలయం భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ హరికిరణ్, కొత్తవలస, వేపాడ సర్వేయర్లు జి.గంగాధర్, జి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.